క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



తిరుపతి ఎంపీ గురుమూర్తితో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు : ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని తిరుపతి ఎంపీ గురుమూర్తి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఉన్న ఆయన నివాసానికి ఎంపీ గురుమూర్తి విచ్చేసి పలు విషయాలపై చర్చించారు.

నేడు జలదంకిలో గడప గడపకు..

జలదంకి : మండలంలోని జలదంకి పంచాయతీ పరిధిలో ఉన్న అప్పారావుతోట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పాలవెల్లి మాలకొండారెడ్డి మంగళవారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు.

పురాతన నంది విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన నంది విగ్రహం

దుత్తలూరు : దుత్తలూరు గ్రామ సమీపంలో ఉన్న పురాతన నంది విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. 565వ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ విగ్రహం అతి పురాతనమైంది. గుప్తనిధులు ఉంటాయన్న అనుమానంతో నంది విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సచివాలయాల్లో గణతంత్ర వేడుకలు జరపాలి

ఆత్మకూరురూరల్ : మండలంలోని అన్ని సచివాలయాల్లో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 26న ఉదయం 8 గంటలకు సచివాలయాల్లో స్థానిక సర్పంచ్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గణతంత్ర వేడుకలు నిర్వహించాలని, అలాగే ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే వేడుకలకు మండలాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

వైఎస్సార్ ఆసరా పంపిణీ నేడు

జలదంకి : స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కార్యక్రమం బుధవారం జరుగుతుందని ఏపీఎం శ్రీధర్‌రావు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు. జలదంకి మండలానికి సంబంధించి 712 డ్వాక్రా గ్రూపులకు చెందిన 10,955 మంది మహిళలకు రూ.5.65 కోట్ల నిధులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డీబీటీ ద్వారా జమ చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని అధికారులు, నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు ఆత్మకూరులో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పర్యటన

ఆత్మకూరు : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష- 2 కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభిస్తారు. 11 గంటలకు ఎంజీఆర్ బస్టాండ్ వద్ద అభిరామ్ ఆస్పత్రి ట్రస్ట్ సౌజన్యంతో 'ప్రాథమిక వైద్య కిట్'ల పంపిణీని ప్రారంభిస్తారు. అనంతరం ఎల్ఆర్‌పల్లిలో కంప్యూటర్ ఎంబ్రాయిడరీ కేంద్రాన్ని, మున్సిపల్ కార్యాలయంలో హ్యాండ్ వాష్ స్టేషన్‌ను ప్రారంభిస్తారు.

27న మండల సర్వసభ్య సమావేశం

ఉదయగిరి : మండల సర్వసభ్య సమావేశం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఈనెల 27న జరుగుతుందని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ మూలె పద్మజ అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ, కో-ఆప్షన్ సభ్యులు హాజరు కావాలన్నారు. మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చిస్తారన్నారు.

అవ్వాతాతలకు ఆర్థిక భరోసా



కలిగిరి ఎస్సీకాలనీలో పుల్లమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మోనిక (ఫైల్)

- రూ.3 వేల పెన్షన్‌తో లబ్ధిదారుల్లో ఆనందం
- గతం కన్నా మిన్నగా పింఛన్ల మంజూరు



కలిగిరిలో పెన్షన్ కానుకను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి (ఫైల్)

కలిగిరి : కుల, మత, పార్టీలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందుతుండడంతో అవ్వాతాతలు మురిసిపోతున్నారు. గతం కంటే రెట్టింపు పింఛన్ నగదు ఇంటికే అందుతుండడంతో వారి ఆనందానికి అవధులు లేవు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019 జనవరి నాటికి సామాజిక పింఛన్ నగదు రూ.1000 మాత్రమే అందేది. సరిగ్గా ఐదేళ్ల తర్వాత 2024 జనవరిలో లబ్ధిదారులు రూ.3 వేల చొప్పున పింఛన్ నగదు పొందుతున్నారు. గత ప్రభుత్వంలో అర్హులైన ఎంతో మందికి జన్మభూమి కమిటీల పేరుతో పింఛన్లు రాకుండా అడ్డుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, పార్టీలకు అతీతంగా గ్రామ సచివాలయాలు, వలంటీర్ల ద్వారా అర్హతే ప్రమాణికంగా పింఛన్లు మంజూరు చేస్తున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి విడతల వారీగా పింఛన్ నగదును రూ.3 వేలకు పెంచుతూ వచ్చారు. దీంతో తమకు ఆర్థిక భరోసా కలిగిందని వృద్ధులు, ఒంటరి మహిళలు, వికలాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని అంటున్నారు.

అదనంగా 1,593 మందికి..

కలిగిరి మండలంలో 6,707 మంది పెన్షన్‌దారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా పెన్షన్ల రూపంలో ప్రభుత్వం రూ.2.01 కోట్లు చెల్లిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మండలంలో కేవలం 5,114 మందికి మాత్రమే పెన్షన్లు అందేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 1,593 మందికి అదనంగా పెన్షన్లు మంజూరయ్యాయి.

కలిగిరి మండలంలో పింఛన్‌దారులు	
గత టీడీపీ ప్రభుత్వంలో	వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో
5114	6707

జగన్ చల్లగా ఉండాలి



మాలాంటి వృద్ధులకు పెద్దకొడుకులా జగన్ వృద్ధాప్య పింఛన్‌ను రూ.3 వేలకు పెంచారు. ప్రతినెలా 1వ తేదీన వలంటీర్ మా ఇంటికి వచ్చి పింఛన్ నగదు అందిస్తున్నారు. రేషన్ సరుకులు కూడా ఇళ్ల వద్దకే వస్తున్నాయి. మాలాంటి వృద్ధులను ఆదుకుంటున్న జగన్ చల్లగా ఉండాలి.

– తాటిపర్తి లక్ష్మమ్మ, కృష్ణారెడ్డిపాళెం, కలిగిరి మండలం

కొత్తగా పింఛన్ తీసుకున్నా



సచివాలయ సిబ్బంది, వలంటీర్ గత నెలలో మా ఇంటికి వచ్చి మీరు దరఖాస్తు చేసుకున్న వృద్ధాప్య పింఛన్ మంజూరైందని చెప్పారు. ఈ నెలలో పింఛన్ నగదు రూ.3 వేలు అందజేశారు. పింఛన్ సొమ్ము అందుకోవడం సంతోషంగా ఉంది. ఎవరి చుట్టూ తిరగకుండా ప్రభుత్వమే పింఛన్ మంజూరు చేసింది.

– మేదం రాగమ్మ, కలిగిరి

అంగన్‌వాడీల సంబరాలు



వరికుంటపాడులో కేక్ కట్ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

- రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో విధుల్లో చేరిక

ఉదయగిరి : వింజమూరు, ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మంగళవారం విధుల్లో చేరారు. గత 42 రోజుల నుంచి 11 డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ సమ్మె చేస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పది డిమాండ్లు తీర్చింది. దీంతో ఆయా కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు సంబరాలు చేసుకుంటూ విధుల్లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను కీర్తిస్తూ కేకులు కట్ చేశారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు.

- సోమశిల : రాష్ట్ర ప్రభుత్వంతో అంగన్‌వాడీ కార్యకర్తల చర్చలు సఫలం కావడంతో అనంతసాగరం మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మంగళవారం విధుల్లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం పలు అంశాలపై ఆమోదం తెలపడంతో విధుల్లో చేరినట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు.

విజయీభవ యాత్రను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చేజర్ల : మండల పరిధిలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం చేపట్టనున్న విజయీభవ యాత్రలో పార్టీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యాత్రలో భాగంగా 24న మధ్యాహ్నం 3 గంటలకు చేజర్లలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. సాయంత్రం కోటితీర్థం గ్రామంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తారన్నారు. అనంతరం వైఎస్సార్ విలేజ్ పార్క్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహావిష్కరణలో పాల్గొంటారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం



రోగికి మందులు అందజేస్తున్న ఎంపీపీ

చేజర్ల : జగనన్న ఆరోగ్య సురక్షతో రోగులకు మెరుగైన వైద్యం అందుతోందని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాడేరు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్యశిబిరం మంగళవారం జరిగింది. వైద్యులు మెహతాబ్, వేణుగోపాల్, మల్లికార్జున సుమారు 507 మంది రోగులను పరీక్షించారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నట్లు తెలియజేశారు. ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో అత్యుత్తమ డాక్టర్ల పర్యవేక్షణలో అత్యాధునిక వైద్యం అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కరిముల్లా, సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ ప్రభావతి, పంచాయతీ సెక్రటరీ శీనయ్య, పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ మాలకొండయ్య

ఉదయగిరి : రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ డి.మాలకొండయ్య పేర్కొన్నారు. ఉదయగిరిలోని బిట్-2 రైతుభరోసా కేంద్రంలో ఉదయగిరి, వింజమూరు ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జిలతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి సాగు చేసే రైతుల పొలాలను ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జిలు క్షేత్రస్థాయిలో సందర్శించాలని సూచించారు. రైతుల పొలాలను చూసిన తరువాత మాత్రమే నేచురల్ ఫార్మింగ్ సర్టిఫికెట్లు మంజూరుకు కృషి చేయాలన్నారు. ఆ సర్టిఫికెట్ల ఆధారంగా రైతులు పండించే ఉత్పత్తులను మంచి ధరకే మార్కెటింగ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. జిల్లా మార్కెటింగ్ జూనియర్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ కె.కోటి మాట్లాడుతూ కేటాయించిన లక్ష్యాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కులగణనను పూర్తి చేయాలి



సర్వే బృందానికి సూచనలిస్తున్న శ్రీనివాసులు

ఉదయగిరి : మండలంలో జరుగుతున్న కులగణన సర్వేను ఈనెల 28వ తేదీ నాటికి నూరుశాతం పూర్తిచేసి లక్ష్యాన్ని సాధించాలని కులగణన ప్రత్యేకాధికారి తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. వెంగళరావునగర్, తిరుమలాపురం సచివాలయాల పరిధిలో జరుగుతున్న సర్వేను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం సమావేశం నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సచివాలయాల పరిధిలో ఇప్పటివరకు 40 శాతం సర్వే పూర్తయిందన్నారు. బుధవారం నాటికి 70 శాతం సర్వే చేయాలని సూచించారు. ఈనెల 28 నాటికి సర్వేను పూర్తిచేయాల్సి ఉందన్నారు. అలాగే నేలటూరులో జరుగుతున్న సర్వేను పరిశీలించారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు



కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

సంగం : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం సోమవారం రాత్రి సంగంలోని పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. ఈ క్రమంలో సంగం తూర్పువీధిలోని కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల ఉత్సవ మూర్తులను మండపంలో కొలువుదీర్చారు. అర్చకుల వేద మంత్రోచ్చారణలు, వందలాది మంది భక్తుల నడుమ కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులు కానుకలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అర్ధరాత్రి వరకు భజన కార్యక్రమాలు జరిగాయి.

విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొడవలూరు: మండలంలోని గండవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రగ్బీలో జాతీయ స్థాయిలో, ఇతర క్రీడల్లో జిల్లా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. వారికి హిందీ పండిట్ జి.నాగభూషణం తమ పాఠశాల పేరు ముద్రించిన దుస్తులను క్రీడా దుస్తులను వితరణగా ఇచ్చారు. వీటిని ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు చేతుల మీదుగా మంగళవారం విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. క్రీడల్లో మరింత ప్రోత్సహించేందుకు హిందీ పండిట్ దుస్తులు వితరణగా ఇవ్వడం అభినందనీయమన్నారు. నాగభూషణం మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి తనవంతు సహకారం ఎల్లవేళలా అందిస్తానన్నారు. కార్యక్రమంలో పీడీ శివనాగబాబు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, కట్టా సురేష్, శ్యామ్, కుంజేటి సురేష్, మల్లికార్జునరావు, కుసుమ, హజరత్తయ్య, ఖాజా హుస్సేన్, మాధవి, హసీన పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలు

నెల్లూరు రూరల్: కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయంలో పరీక్షలపై చర్చ, విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను మంగళవారం నిర్వహించారు. తొమ్మిది నుంచి 12వ తరగతి చదువుతున్న 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు డిజిటల్ సర్టిఫికెట్లతో పాటు స్వాతంత్య్ర సమరయోధుల జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శంకరయ్య, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహాసభల జయప్రదానికి పిలుపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర రెండో మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు పిలుపునిచ్చారు. సభల పోస్టర్లను నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జెట్టి శేషారెడ్డి భవన్‌లో ఈనెల 28వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు మహాసభను ప్రారంభించనున్నారని వివరించారు. పలు తీర్మానాలను ఆమోదించనున్నామని చెప్పారు. సుమన్, ఆరిఫ్, మౌలా, శ్రీను, మురళి, రమేష్, రమణ, రవి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందాం

అల్లూరు : వైఎస్సార్‌సీపీని గెలిపించుకునేలా నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పనిచేయాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి తెలియజేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆమె మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేసేలా ఇంటింటికీ తిరగాలన్నారు. అలాగే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల అరాచకాలను గుర్తుచేయాలన్నారు. పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు నీలం సాయికుమార్, బీద రమేష్, శ్రీకాంత్‌రెడ్డి, దైవాదీనం, మేడా శ్రీనివాసులు రెడ్డి, షేక్ ఉస్మాన్, చెంతాటి కరుణాకర్, భక్తవత్సల్‌రెడ్డి, భాస్కర్, సుధా, రసూల్, శీను, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితా ప్రచురణ

సోమశిల : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాను పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించినట్లు తహసీల్దార్ సుభాషిణి మంగళవారం తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. నూతన ఓటు కోసం ఫారం-6లో నమోదు చేసుకుని బూత్‌లెవల్ అధికారికి అందజేయాలన్నారు.

మోడల్ పాఠశాలలో విచారణ

ఆత్మకూరు : ఏఎస్‌పేటలోని ఏపీ మోడల్ పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడిపై డీఈఓ గంగా భవానీ ఆదేశాల మేరకు ఎంఈఓ జ్యోతి మంగళవారం విచారణ చేపట్టారు. మోడల్ పాఠశాలలో ప్రిన్సిపల్‌కు ఓ ఉపాధ్యాయుడికి మధ్య వివాదం నెలకొంది. కాగా ఆ ఉపాధ్యాయుడిపై ఇప్పటికే పలు ఆరోపణలు వచ్చాయి. దీనిపై పాఠశాలలోని ఇతర ఉపాధ్యాయులను, పలువురు విద్యార్థులను విచారణ చేసి తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా తెలపాలని కోరింది. కాగా వీరు బుధవారం రాతపూర్వకంగా తెలియజేయనున్నారు.

రూ.30 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి

నెల్లూరు(బారకాసు): నగరంలోని 32వ డివిజన్‌లో ఉన్న ముస్లిం శ్మశానవాటికను రూ.30 లక్షలతో అభివృద్ధి చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం నేతలు పేర్కొన్నారు. డివిజన్లోని శ్మశానవాటికలో లైటింగ్ పనులను మంగళవారం పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సహకారంతో.. కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్ చొరవతో దీనిని అభివృద్ధి చేసుకుంటున్నామని చెప్పారు. నేతలు అజీజ్, గౌస్‌బాషా, సర్దార్, మంజూర్, హఫీజ్ సల్మాన్, జావీద్, రహీం, సయీద్, ఆసిఫ్, షఫీ, షమ్మీ తదితరులు పాల్గొన్నారు.

రేపు గ్రామసభలు నిర్వహించాలి

ఉదయగిరి : మండలంలోని అన్ని గ్రామ పరిధిలో ఈనెల 25న పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారీపై తప్పనిసరిగా కార్యదర్శులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు గ్రామసభలు నిర్వహించాలని ఈఓపీఆర్డీ ఎస్.మల్లికార్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రణాళికలను తయారు చేసి గ్రామసభల్లో ఆమోదించి ఈనెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రణాళికల తయారీకి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. కార్యదర్శులు ఇంటి పన్నుల వసూళ్లపై శ్రద్ధ పెట్టాలన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి



సోమశిల : చిలకలమర్రి జెడ్పీహైస్కూల్‌లో పరాక్రమ దివాస్



ఆత్మకూరురూరల్ : కనుపూరుపల్లిలో నేతాజీ చిత్రపటానికి నివాళులు

ఆత్మకూరురూరల్ : నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కనుపూరుపల్లి, బండారుపల్లి, మహిమలూరు, వెన్నవాడ, బోయలచిరివెళ్ల, వాశిలి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు నేతాజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నేతాజీ జీవిత చరిత్ర, స్వాతంత్య్ర పోరాటంలో ఆయన నిర్వహించిన పాత్రపై విద్యార్థులకు వివరించారు.

అనంతసాగరంలో..

సోమశిల : మండల కేంద్రమైన అనంతసాగరంలోని ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని గ్రంథాలయ భాండాగారి నారాయణరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నేతాజీ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.మహబూబ్‌బాషా, ఐఆర్‌టీ బాలభారతి పాల్గొన్నారు.

- చిలకలమర్రి జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం సురేష్ ఆధ్వర్యంలో పరాక్రమ్ దివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆంగ్లేయులను దేశం నుంచి వెళ్లగొట్టడానికి సాయుధ పోరాటాన్ని ఎంచుకున్న గొప్ప దేశభక్తుడు సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీవీ రమణ, మహేష్, వెంకటేశ్వర్లు, రమణరాజు, మదీనా, కృష్ణారెడ్డి, మాధి, ఖాజావలి, శివకృష్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.